క్లుప్తంగా

రేపు క్రిస్మస్ విందు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ (రేపు) బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని విందు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన కోరారు.

మానవీయ విలువలపై అవగాహన అవసరం

రామాపురం : విద్యార్థులు వ్యక్తిగత విలువలు, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తిని జీవితంలో పెంపొందించుకోవాలని ప్రముఖ రచయిత్రి వి.శశికళ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం వ్యకిగత వికాసంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు జీవితంలో పుస్తక పఠనంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, ఉపాధ్యాయుల బృందం, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలు శ్రేయస్కరం

రైల్వేకోడూరు అర్బన్ : ప్రకతి వ్యవసాయం ద్వార పండించిన కూరగాయలు, ఆకుకూరలు మానవాళి ఆరోగ్యానికి శ్రేయస్కరమని సోమవారం ఏఓ సుధాకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని తెలిపారు. క్రిమీ సంహారక మందులు ఉపయోగించకుండా కేవలం జీవామృతం, సేంద్రియ ఎరువులు వాడి పండే పంటలకు భవిష్యత్‌లో డిమాండ్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నివాళి



పుల్లారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు నారపురెడ్డి పుల్లారెడ్డి మృతదేహం వద్ద సోమవారం రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో నీలకంఠారెడ్డి, ఎస్.శ్రీనివాసులరెడ్డి, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, శివయ్య, లక్ష్మిరెడ్డి, జానకిరామయ్య, కె.వి. సుబ్బయ్య, రాజ, ఎం.శ్రీనివాసులరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట : మండల పరిధిలోని సీతారాంపేట గ్రామానికి చెందిన భీమిశెట్టి బలరామయ్యకు సీఎం సహాయనిధి నుంచి రూ.4,15,250లు చెక్కును సోమవారం రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి చేతులమీదుగా బాధితునికి అందించారు. దీంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దొంతు శివయ్య, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయం పట్ల ఆసక్తి కల్పించాలి



పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

చిట్వేలి : విద్యార్థులలో వ్యవసాయం పట్ల ఆసక్తి కల్పించాలని పాఠశాల కరస్పాండెంట్ రెడ్డయ్య అన్నారు. సోమవారం స్థానిక శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో రైతు దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రైతు దినోత్సవంలో 9, 10వ తరగతుల విద్యార్థులు కొత్తపల్లిలో రైతులతో కలిసి పొలాలను సందర్శించి వ్యవసాయ పద్ధతులు, ఆధునిక పనిముట్లు గురించి తెలుసుకున్నారు.

అర్జీలను పరిష్కరించాలి

పుల్లంపేట : స్పందన ద్వారా వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం పుల్లంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీరాములు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నిధులు బొక్కారు.. నిర్మాణం మరిచారు!

- 2019లోనే మండల కేంద్రం నుంచి కోనేటివాళ్లపల్లె రోడ్డు నిర్మాణానికి నిధులు
- కంకర తోలి బిల్లులు పొంది పనులు చేయని కాంట్రాక్టర్
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం, అధికారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపునీరు



కంకర తేలి వాహనదారులకు ఇబ్బందులు గురి చేస్తున్న రోడ్డు మార్గం

వీరబల్లి : మండల కేంద్రం నుంచి ఏ మార్గం వైపు వెళ్లాలన్న వాహనదారులు ఎందుకు వచ్చిన ప్రయాణం రా దేవుడా అనే విధంగా రోడ్ల పరిస్థితి తయారైంది. కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల వేళ హామీలను గుప్పించి ఓట్లను దండుకుంది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న కొత్త రోడ్లు వేయడం దేవుడెరుగు మంజూరు అయిన రోడ్లను కూడా పూర్తి చేయించడంలో దృష్టి సారించకుండా సహజ వనరులను కొల్లగొడుతూ ఆదాయం ఆర్జించడంలో తలామునకలయ్యారు. కాగా మండల కేంద్రం నుంచి బుట్టపల్లి, తొట్టికాడ హరిజనవాడ, తూర్పుపోలువాండ్లపల్లి, నాయనవారిపల్లి, సుగాలితాండ లింకు రోడ్డును కలుపుతూ గుర్రప్పగారిపల్లి పంచాయతీ కోనేటివాళ్లపల్లె మెయిన్ రోడ్డును కలుపుతూ 2019వ సంవత్సరంలో రూ. 3.15 కోట్లతో తారురోడ్డు పనులను ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు ఈ రోడ్డు ఫార్మేషన్ చేసి కంకరతోలి రూ.1.40 కోట్ల బిల్లును పొంది పనులు చేయడం ఆపేశారు. దీంతో గ్రామాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉన్న రోడ్డుపై కాస్త గుంతలు ఏర్పడి, మట్టి, కంకర కొట్టుకుపోయి అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అంతేకాక ఈ రోడ్డు మార్గం పొలాలగుండా వేయడంతో రైతులు కూడా వెళ్లడానికి, పండించిన పంటలను తీసుకురావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గతంలో పనిచేసిన కాంట్రాక్టర్లను ఈ విషయంపై వివరణ అడుగగా బిల్లులు రాకపోవడంతో రోడ్డు పనులు ఆపేసినట్టు వాపోయారు. ఈ పనులు ఆపివేసి ఏళ్ల గడుస్తున్నా అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డుపై వెళ్లే గ్రామస్తులు, ప్రజలు, రైతులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలు, రైతుల సౌకర్యార్థం రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

10 గ్రామాలకు ఉపయోగకరం



ఈ రోడ్డు పనులు మధ్యలో ఆపేయడం చాలా దారుణం. ప్రస్తుతం ఈ రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియకుండా ఉంది. చిన్నచిన్న ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవుతున్నారు. వెంటనే ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నాం.

– ఆరంరెడ్డి, వ్యవసాయ రైతు, తూర్పు పోలువాండ్లపల్లి, వీరబల్లి మండలం

పనులు పూర్తయితే వీరబల్లికి..



ఈ రోడ్డు వలన వీరబల్లి మండలానికి వెళ్లడానికి చాలా అనుకూలం. అంతేకాక ఇటు వీరబల్లి వాసులు రాజంపేటకు వెళ్లాలన్నా త్వరగా చేరుకోవచ్చు. రైతులు పొలాల గుండా దాదాపు పది గ్రామాలు కలుపుకుంటూ మండల కేంద్రానికి ఈ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డు పనులు మధ్యలో ఆగిపోవడం చాలా బాధాకరం. ఎంతోమంది ప్రజలకు, రైతులకు సౌకర్యార్థం గుర్తించి ఈ రోడ్డు మార్గాన్ని తీసుకొచ్చారు. పనులు నిలిచిపోవడంతో రైతులు తమ తోటలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులను పూర్తి చేసేలా దృష్టి సారిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– సుబ్బరామరాజు, రైతు, కోనేటివాళ్లపల్లి, వీరబల్లి మండలం

సబ్ జైలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

రాజంపేట : రాజంపేట సబ్ జైలును సోమవారం న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను విజిట్ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌పై ఖైదీలతో మాట్లాడారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లు, రిజిస్టర్‌లను పరిశీలించి సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబరు 15100పై ఖైదీలకు అవగాహన కల్పించారు.

ముస్తాబైన ప్రార్థనా మందిరం



పెనగలూరు : మండలంలోని చక్రంపేట వద్ద బ్రహ్మంగారి ఆలయం ఎదురుగా ఉన్న కర్మెలు ప్రార్థనా మందిరం క్రిస్మస్‌కు ముస్తాబు చేశారు. చర్చిని రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ వేడుకలకు సంబంధించి బ్యానర్లు సిద్ధం చేశారు. క్రిస్మస్ వేడుకలకు మండలంలోని నలుమూలల నుంచి ప్రార్థనా మందిరానికి వస్తారని పాస్టర్ దయా ప్రేమసాగర్ తెలిపారు.

ఆర్‌అండ్‌బీ అధికారులు మొద్దునిద్ర వీడాలి



ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గాలివీడు : కోట్లు విలువజేసే ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే తొలగించకుండా కాలయాపన చేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు మొద్దునిద్ర వీడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం గాలివీడులో పర్యటించిన ఆయన సీపీఐ నాయకులతో కలసి గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు పట్టణంలోని గేటు నాలుగురోడ్ల కూడలిలో ఉన్న దాదాపు 1.55 ఎకరాల భూమి అక్రమార్కుల చెరలో చిక్కుకోగా, అందులో కొంత రెవెన్యూ అధికారుల చొరవతో అక్రమ నిర్మాణాలు తొలగించినప్పటికీ అందులో కనీసం కంచె గానీ బౌండరీ గానీ ఏర్పాటు చేయకపోవడం ఆక్రమణదారులను ప్రోత్సహించే విధంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఓ వైపు ఉన్న నిర్మాణాలను తొలగించి మరోవైపు ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. గతవారంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల చొరవతో కొంతమేర ఆక్రమణలు తొలగించినప్పటికీ మిగిలిన ఆక్రమణలు తొలగించడానికి ఆర్ అండ్ బీ అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు మీనమేషాలు లెక్కించకుండా నాలుగురోడ్ల కూడలిలో విలువైన భూములు ఆక్రమణ చెర నుంచి విడిపించి ప్రభుత్వానికి ఆదాయం చేకూరేలా టెండర్ల ద్వారా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్ల బిగింపు అమలును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జిల్లాలో అకాల వర్షాలు ఒక వైపు, మరో వైపు కరువు పరిస్థితులతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులను రైతుల పంటసాగుకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలతో వ్యవసాయ పనులు చేయించడం రైతాంగానికి ఎంతో లాభాన్ని చేకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు హరినాథరాయుడు జయలక్ష్మి, రెడ్డి తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాలి



రాజంపేట టౌన్‌: రైతులను సన్మానిస్తున్న నేతలు

రాజంపేట టౌన్ : రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో రైతులను సత్కరించారు.

ఏయూ అధ్యాపకుల ఆధ్వర్యంలో..

రాజంపేట : అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవసాయ విద్యా కళాశాలలో సోమవారం రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడంలో ముందంజలో ఉందని అధ్యాపకులు పేర్కొన్నారు. రైతులు కృషి దేశాభివృద్ధికి పునాదిగా ఉందన్నారు. అనంతరం మదన గోపాలపురంలో ర్యాలీ నిర్వహించారు.

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్లో కిసాన్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీ చైతన్య ప్రాంతీయ సంచాలకులు పి.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు.

ఆదర్శంగా నిలిచిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

సంబేపల్లె : జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణ – డిజిటల్ సౌలభ్యం'పై వక్తృత్వ పోటీలలో మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి విశ్వానందరెడ్డి, విద్యార్థిని మంజులతోపాటు మరో విద్యార్థి పాల్గొని ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది సన్మానించారు.

ముందుగానే క్రిస్మస్ కళ



డాల్ఫిన్ డేల్ స్కూల్లో క్రీస్తు జన్మ ఇతివృత్తాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన పశువుల పాక

పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రత్యేక వేషధారణల్లో కనువిందు చేశారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. క్రిస్మస్ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

– రైల్వేకోడూరు అర్బన్



ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు



విజ్‌డమ్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పేటలో తొలి ప్రార్థనా మందిరం..

లూథరన్ చర్చి

- విద్యాభివృద్ధికి విశేష కృషి
- వైద్య సేవలందించిన ఘనత కూడా..
- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి



లూథరన్ చర్చిలోని పరిశుద్ధ స్థలం (శాంక్టమ్)



రాజంపేటలో తొలి ప్రార్థనా మందిరం

రాజంపేట టౌన్ : పట్టణంలో లూథరన్ చర్చి తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. పట్టణంలో తొలి క్రైస్తవ ప్రార్థనా మందిరం లూథరన్ చర్చి కావడం విశేషం. అంతేకాక ఎంతో విశిష్టత కూడా సంతరించుకుంది. స్వాతంత్ర్యానికి పూర్వమే 1945వ సంవత్సరంలో పట్టణంలోని మెయిన్‌రోడ్డులో చిన్నపాటి గదిలో లూథరన్ చర్చి ఏర్పాటైంది. అప్పట్లో దేశ, విదేశాల నుంచి వచ్చే బ్రిటీషు వారు సైతం ఈ చర్చిలో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేవారు. లూథరన్ చర్చి బ్రిటీషు వారు ఏర్పాటు చేసిన తొలుత మనదేశానికే చెందిన జె.దొరైస్వామి పాస్టర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి లూథరన్ చర్చికి క్రైస్తవులు, విశ్వాసులు ఎక్కువ సంఖ్యలో వచ్చి ప్రార్థనలు చేసుకోవడం ప్రారంభమైంది. అందువల్ల 1965వ సంవత్సరంలో ఆర్‌ఎస్‌రోడ్డులో విశాలమైన స్థలంలో లూథరన్ చర్చిని నిర్మించారు. ఈ చర్చి నిర్మాణానికి రెండవ పాస్టర్‌గా నియమితులైన జె.జేసుదాసు విశేషంగా కృషి చేశారు. జేసుదాసు దాదాపు ఇరవై నాలుగేళ్లపాటు లూథరన్ చర్చికి విశేష సేవలు అందించారు. ఆయన చేసిన సేవలకు క్రైస్తవులు చర్చిలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం విశేషం. కాగా క్రిస్మస్ సమీపిస్తుండటంతో లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తును స్తుతిస్తూ, క్రిస్మస్‌కు స్వాగతం పలుకుతూ చేపట్టే వివిధ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. క్రిస్మస్ సందర్భంగా ఒకరోజు ముందు ఈవ్ వేడుకలను నిర్వహించడం, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయడం లూథరన్ చర్చి ప్రత్యేకత అని చెప్పాలి.

తొలుత పాఠశాలలు.. ఆపై వైద్య సేవలు

భారతదేశం ఆంగ్లేయుల పాలనలో ఉన్నప్పుడు అక్షరాస్యత శాతం అతి తక్కువగా ఉండేది. పాఠశాలలు అంతంత మాత్రమే ఉండటంతో ప్రజలు చదువుకునేందుకు అవకాశాలు ఉండేవి కావు. ఆంగ్లేయులైన లూథరన్ చర్చి ప్రతినిధులు దీనిని గుర్తించి ప్రజలను విద్యావంతులు చేయాలని సంకల్పించారు. అందులో భాగంగా 1910వ సంవత్సరంలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో తొలిసారిగా మండలంలోని ఆకేపాడు, బలిజపల్లె, గాలివారిపల్లె, ఊటుకూరు గ్రామాల్లో, పెనగలూరు మండలంలోని నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇవి లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాలలుగా పనిచేసేవి. అయితే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1969వ సంవత్సరంలో ఈ పాఠశాలలను స్థిరాస్తులతో ప్రభుత్వానికి అప్పజెప్పారు. ఇప్పుడు ఈ పాఠశాలలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా ప్రభుత్వం ఆధీనంలో జెడ్పీ పాఠశాలలుగా నడుస్తున్నాయి. ఇదిలావుంటే ఏమాత్రం వైద్య సేవలు అందుబాటులో లేని రోజుల్లో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆ చర్చి ప్రతినిధులు ప్రజలకు వైద్య సేవలు కూడా అందించడం విశేషం.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నేను చిన్నప్పటి నుంచి ప్రభువు చూపిన మార్గంలోనే పయనిస్తున్నాను. చివరి శ్వాస వరకు ప్రభువు సేవలోనే కొనసాగుతూ అనార్థులకు సేవలందిస్తా. ప్రపంచ వ్యాప్తంగా లూథరన్ చర్చిలకు ఎంతో గుర్తింపు ఉంది. తాను కౌన్సిల్ ప్రెసిడెంట్ కావడం ప్రభువు ఇచ్చిన గొప్పవరంగా భావిస్తున్నా. క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం.

– జాన్ ప్రభాకర్, కౌన్సిల్ ప్రెసిడెంట్, లూథరన్ చర్చి, రాజంపేట

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భజన బృందం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అమ్మవారిశాల దేవస్థానంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి నగర సంకీర్తన చేశారు. ఉదయం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బహుమతులు ప్రదానం

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీరాములు మాట్లాడుతూ రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, గణిత టాలెంట్ పోటీలు జరిపామన్నారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అందజేసి వారిని అభినందించామన్నారు. బదిలీపై బద్వేల్‌కు వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ సుభాషిణికి సన్మానించినట్టు తెలియజేశారు.

బాలల దివస్‌ను ఘనంగా జరపండి

రాయచోటి టౌన్ : ఈనెల 26వ తేదీ అన్ని పాఠశాలలో బాలల దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతి రాజు డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. సిక్కుల 10వ గురువు గురు గోబింద్ సింగ్ మొఘల్ చక్రవర్తి అయిన ఔరంగజేబుతో పోరాటం సాగిస్తున్న సమయంలో గురుగోబింద్ సింగ్ కుమారుడు 9 ఏళ్ల వయస్సు ఉన్న బాబా జోరావర్ సింగ్‌ను, 6 సంవత్సరాల వయస్సు ఉన్న బాబా ఫతేసింగ్‌లను చిత్రహింసలకు గురిచేసి చివరికి గోడలో సజీవ సమాధి చేశారన్నారు. వారి ఆత్మార్పణంగా దేశం మొత్తం డిసెంబర్ 26న బాలల దివస్ నిర్వహిస్తోందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఒక ఉత్తర్వును విడుదల చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో బాలల దివస్‌ను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నాయక్, నందగోపాల్, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై ఉన్న కరెంటు తీగలను తొలగించండి

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల పైన ఉన్న కరెంటు తీగలను వెంటనే తొలగించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చిన్నమండెం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. మంత్రి ఉర్దూ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు కరెంటు తీగల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి కరెంటు తీగలను తొలగించాలని ఆదేశించారు.

పరామర్శ, ఆర్థిక సహాయం

రామాపురం : కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలిబిడికికి చెందిన బుక్కే రెడ్డినాయక్‌కు ప్రమాదం జరిగి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఎంఎస్‌ఆర్‌ఎం ట్రస్టు ద్వారా రెడ్డినాయక్‌కు ఆర్థిక సహాయం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర మంత్రి మండిపల్లి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యంలు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

వీఆర్‌ఏ పోస్టు కేటాయించాలని వినతి

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా కల్నాయునిచెరువు వీఆర్‌ఏ తొట్టి సుబ్బరాయుడు మరణించగా కారుణ్య నియామకం కింద ఆ పోస్టును తనకు కేటాయించాలంటూ మృతుని కోడలు తొట్టి రేవతికుమారి సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ వీఆర్‌ఏ పోస్టుకు తాను దరఖాస్తు చేసుకోగా అప్పటి తహసీల్దార్ కోర్టుకు వెళ్లి లీగల్ హైర్‌ను నిర్ధారించుకుని వచ్చిన తర్వాత వీఆర్‌ఏగా నియమిస్తామని చెప్పారన్నారు. ఈ విషయమై తాము కోర్టులో దావా వేసి ఉన్నామని, కోర్టులో వీఆర్‌ఏ నియామకం గురించి ఉండగా ప్రస్తుత తహసీల్దార్ ఆ పోస్టును మరొకరికి ఇచ్చారన్నారు. వీఆర్‌ఏగా చనిపోయిన తన మామ (భర్త తండ్రి) తనకు అవకాశం కల్పించాలని విన్నవించారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం హరిజనవాడకు చెందిన వరుణ్ (28) రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి మృతుడి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన కుటుంబానికి పార్టీ తరపున అండదండలు అందిస్తామన్నారు.